కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే వివేకానంద్



దుండిగల్: బీఆర్‌ఎస్ పార్టీ శాసనసభ విప్‌గా నియమితులైన ఎమ్మెల్యే వివేకానంద్ శుక్రవారం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను నర్సింగి జయభేరి టెంపుల్ ట్రీ కాలనీలో కలిశారు. కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల్లో పార్టీపై ఉన్న నమ్మకాన్ని నిలబెట్టేందుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెలే వెంట ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఉన్నారు.

ఆస్తి పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలి

నిజాంపేట్ : సకాలంలో ఆస్తి పన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ సాబేర్ అలీ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ. 2024–25 ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగుస్తున్నందున ఆస్తి పన్నులు, దుకాణం లైసెన్స్ తదితర ఫీజులను వెంటనే చెల్లించాలన్నారు. చెల్లించకుంటే బకాయిదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. సెలవు రోజుల్లో కూడా అన్ని పన్నులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

కరాటే పోటీలో సత్తా చాటిన విద్యార్థి



నిజాంపేట్: అంతర్జాతీయ కరాటే పోటీలో ప్రగతి విద్యానికేతన్ విద్యార్థి దండుగుల శశిధర్ సత్తా చాటాడు. ఏపీలోని విశాఖపట్నం కేంద్రంగా జరుగుతున్న రెండవ అంతర్జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ హైపర్ కప్ 2025 పోటీలు జరుగుతున్నాయి. ప్రగతి నగర్‌లోని ప్రగతి విద్యానికేతన్‌లో 4వ తరగతి చదువుతున్న శశిధర్ ప్రతిభ కనబరిచాడు. అండర్ 10 సంవత్సరాల విభాగంలో పోటీపడిన శశిధర్ మూడో స్థానంలో నిలిచాడు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

జగద్గిరిగుట్ట: రింగ్ బస్తీలో తుల్జా భవానీ సమేత రక్తమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ నెల 4న మొదలైన ప్రత్యేక పూజలు శుక్రవారంతో ముగిశాయి. బ్రహ్మశ్రీ మాతేశ్వర శర్మ, వీరాగ్రహజాచార్యులు, నవీనాచార్యుల సమక్షంలో పూజలు జరిగాయి. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు గొప్పవరం



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్: సీఎం సహాయనిధి పేదలకు గొప్పవరం అని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. బాచుపల్లికి చెందిన కేసిరెడ్డి బాల్‌రెడ్డికి మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో రూ.2.50 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు మంజూరైంది. ఆ చెక్కును నియోజకవర్గంలోని బాచుపల్లి పార్టీ కార్యాలయంలో శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎన్‌ఎంసీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు సిద్దనోళ్ల సంజీవరెడ్డి, అంజాద్, పద్మారావు, మోహన్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు గొంగుల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

చింతల్: కాలనీలో రోడ్లను ఆక్రమించి రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని చింతల్ డివిజన్ చంద్రానగర్ అడ్వైజర్ డేగల కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. చంద్రానగర్‌లోని రోడ్డు నెంబర్ 1, 2 లలో రోడ్డుకు ఇరువైపులా పలు భవన యజమానులు ఇప్పటికే కొంతమేర ముందుకు జరిగి నిర్మాణాలు చేపట్టారని అన్నారు. వారి భవనాలు పూర్తయిన తర్వాత మెకానిక్ వర్క్ షాపులు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, వివిధ తిను బండారాల దుకాణదారులకు, ఇతర వ్యాపారులకు అద్దెకు ఇవ్వడంతో వారు రోడ్లను ఆక్రమిస్తున్నారన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

అభివృద్ధికి నోచుకోక..

ఆహ్లాదం పంచక!



స్వామి వివేకానంద పార్కులో పేరుకుపోయిన వ్యర్థాలు

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పార్కులు అభివృద్ధికి నోచుకోవడం లేదు. గ్రామ పంచాయతీల నుంచి మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పడిన నాటి నుంచి ప్రగతి నగర్, బాచుపల్లి, నిజాంపేట్ ప్రాంతాల్లో ఉన్న పార్కులను అభివృద్ధి చేయడంలో మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. సేద తీరేందుకు, చిన్న పిల్లలు ఆడుకునేందుకు వీలుగా కాలనీల్లో, బస్తీల్లో ఉన్న పార్కులను అభివృద్ధి పరిస్తే అందరికి ఉపయోకరంగా ఉంటుంది. మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 130 పార్కులు ఉండగా అందులో ప్రగతినగర్‌లోనే 52 పార్కులు ఉన్నాయి. మిగతావి బాచుపల్లిలో, నిజాంపేట్ ప్రాంతాల్లో ఉన్నాయి. వీటిల్లో 70 శాతం పార్కులు పూర్తి స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదు.
– నిజాంపేట్

- పార్కులను పట్టించుకోని అధికారులు
- నిరుపయోగంగా జిమ్ పరికరాలు, పిల్లల ఆట వస్తువులు
- కనీస వసతులు కరువే



సర్వేపల్లి రాధాకృష్ణ పార్కులో కూలిన షెడ్డు

ఓపెన్ జిమ్, ఆట పరికరాలకు మరమ్మతులేవి?

కార్పొరేషన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. కానీ వాటి నిర్వహణ మాత్రం మరిచారు. అనేక చోట్ల ఓపెన్ జిమ్ పరికరాలు పనిచేయడం లేదు. కొన్ని చోట్ల ఆట వస్తువుల పరికరాలు విరిగిపోయాయి. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామం చేసేందుకు ఉపయోగపడాల్సిన ఓపెన్ జిమ్‌లు నిరుపయోగంగా ఉండటం అధికారుల పనితీరుకు నిదర్శనం. ఇక చిన్న పిల్లలు ఆడుకునేందుకు పార్కుల్లో ఏర్పాటు చేసిన ఆట పరికరాలు సైతం మరమ్మతులు నోచుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి.

చెత్తాచెదారాలతో ..

పార్కులంటేనే పచ్చదనం. అలాంటి పచ్చదనం లేకపోవడంతో సందర్శకులకు ఆహ్లాదం కరువైంది. పరిశుభ్రత లేకపోవడంతో వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. కేవలం అక్కడక్కడ మాత్రమే కొన్ని పార్కులు పచ్చదనంతో దర్శనమిస్తున్నాయి. వాకింగ్‌ట్రాక్ చెత్తాచెందారంతో నిండిపోతున్నాయి. నిర్వహణ సరిగా లేకపోవడంతో వ్యర్థాలకు డంపింగ్ కేంద్రంగా పార్కులు మారుతున్నాయి.



మరమ్మతులకు నోచుకోని ఆట వస్తువులు

పార్కులను అభివృద్ధి చేయాలి

పార్కులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలి. మురికివాడ ప్రాంతాల్లో అసలు పార్కులే లేవు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో పార్కులు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. ఉన్న పార్కులను ఆహ్లాదంగా తీర్చిదిద్దాలి.
– మహేందర్, మాజీ వార్డు సభ్యుడు, బాచుపల్లి

పరికరాలకు మరమ్మతులు చేపట్టాలి



ఆయా పార్కుల్లో పిల్లల ఆట వస్తువులు, ఓపెన్ జిమ్ పరికరాల నిర్వహణ సరిగా లేదు. దీంతో పరికరాలు విరిగి మరమ్మతులకు నోచుకోక ఉపయోగంలో లేవు. మూత్ర శాలలు సైతం ఏర్పాటు చేయాలి. పచ్చదనంతో కళకళలాడే విధంగా పార్కులను తీర్చిదిద్దాలి.
– మహ్మద్ జహంగీర్, ప్రగతినగర్

వాకింగ్ ట్రాక్‌లు కరువు

చాలా పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌లు లేవు. ఉన్న పార్కులను అలా ఖాళీగా వదిలేశారు. ప్రజలు అధికారులను అడిగితే నిధులు సమస్యను తెరమీదగా తెస్తున్నారు. దీంతో పార్కులకు వచ్చే వారి సంఖ్య కూడా తగ్గుతుంది.

ఆలయ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

జీడిమెట్ల: గ్రామదేవతల అనుగ్రహంతో ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. మూడు రోజులుగా ఎస్.ఆర్.నాయక్‌నగర్‌లో జరుగుతున్న పెద్దమ్మ పోచమ్మ తల్లి 20వ వార్షికోత్సవ కార్యక్రమాల్లో శుక్రవారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆలయ సమీపంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు గోగినేని శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు గోపాల్‌రెడ్డి, బొబ్బా ప్రసాద్, రంగారావు, చారి, విజయ భాస్కర్‌రెడ్డి, బాబి, సుబ్బరాజు, మహేందర్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్: కొంపల్లి గ్రామంలోని దుర్గమ్మ మహంకాళి అమ్మవారి కల్యాణోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ మంజుల కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్, మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీశైలంయాదవ్ తదితరులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: సమ్మర్‌యాక్షన్ ప్లాన్‌లో భాగంగా చేపట్టిన ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేట్‌బషీరాబాద్ ఏఈ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ సత్యం ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు దండమూడి ఎన్‌క్లేవ్, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం, సురక్షా ఆసుపత్రి, ఆర్టీఓ కార్యాలయం, 11కేవీ జయరామ్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జయరామ్‌నగర్, శ్రీకృష్ణనగర్, రుక్మిణి ఎస్టేట్స్, జీకే నగర్, 11కేవీ గాయత్రినగర్ ఫీడర్ పరిధిలో గాయత్రినగర్, గోదావరి హోమ్స్, బీమ్స్ అండ్ కాలమ్స్ అపార్ట్‌మెంట్స్, 11కేవీ జీడిమెట్ల గ్రామ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జీడిమెట్ల గ్రామం, భీమా ప్రైడ్, గ్రీన్ పార్క్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లేన్, పిస్తా హౌజ్, 11కేవీ మీనాక్షి ఫీడర్ పరిధిలో గ్రీన్ పార్కు, మీనాక్షి ఎస్టేట్స్, స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

నేటి నుంచి అమ్మవారి జాతర

సుభాష్‌నగర్: సూరారంలోని కట్ట మైసమ్మ రేణుక ఎల్లమ్మ ఆలయ జాతర శనివారం నుంచి ప్రారంభం కానుంది. ఆలయ పరిసర ప్రాంతాలను రంగ రంగుల లైట్లతో అలంకరించారు. మొదటి రోజు గణపతి పూజ, అగ్ని ప్రతిష్ఠ, అమ్మవార్ల కల్యాణం, ఒడి బియ్యం, సూరారం గ్రామం నుంచి అమ్మవార్ల ఊరేగింపు జరుగనుంది. నాలుగు రోజుల పాటు ఉత్సవాలు జరుగనున్నాయి. భక్తులకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది.

నేడు ఉచిత వైద్య శిబిరం

రంగారెడ్డినగర్: మల్లారెడ్డి ఆసుపత్రి సౌజన్యంతో ఆల్ ఇండియా పాయమ్–ఈ– ఇన్సానియత్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ గురుమూర్తినగర్‌లోని మజీద్–ఇ–నూర్ వద్ద ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు వైద్య శిబిరం కొనసాగుతుంది. డయాబెటీస్, బీపీ, డెంటల్, ఆర్థోపెడిక్, సాధారణ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయనున్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



చెక్కులను అందజేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

ఆల్విన్‌కాలనీ: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పీఏసీ చైర్మన్ గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి డివిజన్‌ల పరిధిలోని పలువురికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను 50 మంది లబ్ధిదారులకు శుక్రవారం కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, బ్రిక్ శ్రీనివాస్, పోతుల రాజేందర్, మార్లె శ్రీనివాసరావు, పురేందర్ రెడ్డి, కావూరి అనిల్, ఎల్లం నాయుడు, పోశెట్టి గౌడ్, శ్రావణిరెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బయో మైనింగ్ పనులను పరిశీలించిన ఆర్‌డీఎంఏ



దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి డీ పోచంపల్లి సర్వే నంబర్ 120లోని డంపింగ్ యార్డును శుక్రవారం ఆర్‌డీఎంఏ శ్రీనివాస్ రావు సందర్శించారు. డంపింగ్ యార్డులో సాగర్ మోటార్స్ కంపెనీ చేపట్టిన బయో మైనింగ్ పనులను పరిశీలించారు. 90 శాతం పనులు పూర్తి కావడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. మిగతా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్, ఇంజినీర్ సురేందర్ నాయక్, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ సాత్విక్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బీపీ నిర్ధారణ పరీక్షలు

బాలానగర్: బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శనివారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బి.పి. నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పి. వినోద్ శుక్రవారం తెలిపారు. బి.పి. ఉన్నవారికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లు గురించి సూచిస్తారు. మందులు సక్రమంగా వాడకపోతే వచ్చే దుష్పరిణామాలను వివరిస్తారు. ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు.

జీడిమెట్లకు బస్సు సౌకర్యం కల్పిస్తాం

కుత్బుల్లాపూర్: జీడిమెట్లకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామని డిపో మేనేజర్ ఆంజనేయులు అన్నారు. బస్సు సౌకర్యం లేక సీనియర్ సిటిజన్‌లు పడుతున్న ఇబ్బందులను బీజేపీ నాయకుడు భరత సింహారెడ్డి ఇటీవలే అధికారులను కలిసి వివరించారు. దీంతో శుక్రవారం కుత్బుల్లాపూర్ కమిషనర్ నరసింహ, జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ తో కలిసి పర్యటించారు. ఆర్టీసీ బస్సును గతంలో నడిచిన విధంగా ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో ఈ సర్వీసులు ఉండాలని స్థానికులు కోరారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించిన అనంతరం బస్సు సౌకర్యం ఉంటుందన్నారు.



డీఎంకు సమస్యను వివరిస్తున్న నాయకులు, సీనియర్ సిటిజన్‌లు

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతాం



అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

సుభాష్‌నగర్: శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దడమే కార్నివాల్ ఫౌండేషన్ ధ్యేయమని ఫౌండేషన్ ఫౌండర్ జాకీ కార్నివలి అన్నారు. గాజులరామారం గ్రామంలోని ప్రైమరీ స్కూల్ శిథిలావస్థకు చేరడంతో ఇటీవల అధికారులు కూల్చివేశారు. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తడంతో విషయం తెలుసుకున్న కార్నివాల్ ఫౌండేషన్ రూ.70 లక్షల వ్యయంతో నిర్మించనున్న అదనపు గదుల నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు భవిష్యత్‌లో సమస్య తలెత్తకుండా ముందస్తుగా రెండు గదులను నిర్మిస్తున్నామని, మిగతా గదులను దశల వారీగా పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ అట్లూరి రాధిక, చంద్రశేఖర్, హరిబిందు, ప్రధానోపాధ్యాయుడు తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడి విగ్రహ ప్రతిష్ఠాపన



నిజాంపేట్: నిజాంపేట్ జర్నలిస్టు కాలనీలో శుక్రవారం ఉదయం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం జరిగింది. వేద పండితులు నవీన్ శర్మ బృందం అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రతిష్ఠ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జర్నలిస్టు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేంద్ర చారి, గోవింద రావు, సత్యనారాయణ, మల్లికార్జున్, పితాని శ్రీనివాసరావు, జగదీశ్వర్ గుప్తా, దేవేందర్‌గుప్తా, రాము, జీతయ్య తదితరులు పాల్గొన్నారు.

నిప్పు లేకుండా విద్యార్థుల వంటకాలు

కుత్బుల్లాపూర్: చింతల్ వేంకటేశ్వరనగర్‌లోని బీపీఎస్ ఒలింపియాడ్ పాఠశాలలో శుక్రవారం నిప్పు లేకుండా వంటల కార్యక్రమాన్ని నిర్వహించారు. 7, 8వ తరగతుల విద్యార్థులు మంటతో అవసరం లేకుండా సులభంగా చేసుకునే పలు వంటకాలను చేసి చూపించారు. పాఠశాల చైర్మన్ కోటిరెడ్డి విద్యార్థుల వంటకాల రుచి చూసి ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



పదార్థాలను తయారు చేస్తున్న విద్యార్థులు

ఘనంగా శ్రీశ్లోక స్కూల్ వార్షికోత్సవం

దుండిగల్: గండిమైసమ్మలోని శ్రీ శ్లోక స్కూల్ ఎనిమిదవ వార్షికోత్సవాన్ని పాఠశాల ఎండీ ఆంజనేయులు ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ శాసనసభ విప్ వివేకానంద్, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీఐ ఆంజనేయులు, ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ హుస్సేన్, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వివేకానంద్‌కు జ్ఞాపికను అందజేస్తున్న యాజమాన్యం

నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

సుభాష్‌నగర్: కోర్టు వివాదంలో ఉన్న స్థలంలో నిర్మాణాలు చేపట్టి వ్యాపారం నడుపుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ సుజాత శ్రీహరి శుక్రవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తాను సర్పంచ్‌గా 2009లో కొనసాగుతున్న సమయంలో స్థానికంగా సర్వే నంబర్ 227/1 లో 353 ఎకరాల 30 గుంటలకు గాను 163 ఎకరాల విస్తీర్ణంలో సాయినాథ్ సొసైటీ వెంచర్ చేయగా, మిగతా స్థలంలో మరి కొందరు వెంచర్ చేశారని తెలిపారు. సదరు స్థలం ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ అదే సంవత్సరం కోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. అప్పటి నుంచి కోర్టు వివాదంలో ఉన్న సదరు స్థలంలో ఓ వ్యక్తి వృద్ధాశ్రమం ఉచితంగా ఏర్పాటు చేశానని చెప్పి ప్రస్తుతం ఒక్కొక్కరి వద్ద నెలకు రూ.10 వేలు చొప్పున వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. మరో వ్యక్తి కమ్మ సంఘం పేరిట ఫంక్షన్ హాల్‌ను నిర్మించి ప్రతి శుభకార్యానికి రూ. 40 వేలు తీసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎగ్జిబిషన్‌లో ఆకట్టుకున్న ప్రదర్శనలు

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగనగర్‌లోని విజేత విద్యాలయంలో మైండ్ స్పార్క్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం తెలంగాణ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు అంశాలు చాలా బాగున్నాయని మంత్రి కొనియాడారు. ఎగ్జిబిషన్‌లో రోవర్, రాడార్, చంద్రయాన్, ఆటోమేటిక్ కార్ పార్కింగ్ ఇండికేటర్, లేజర్ సెక్యూరిటీ అలారం, కార్బన్ ప్యూరిఫికేషన్, రివర్ క్లీనింగ్ బోట్ తదితర వాటిని విద్యార్థులు ప్రదర్శించారు. ఎగ్జిబిషన్‌లో పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్, ప్రిన్సిపల్ పద్మజ, వడితల ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ శ్రీనివాసరావు, పాఠశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రణవ్ పాల్గొన్నారు.

ఆడబిడ్డ పెండ్లికి తులం బంగారం ఇవ్వాలి

- హామీలను అమలు చేయాలి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల అందజేత



కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ/బాలానగర్: ఆడపడుచులకు కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం వెంటనే ఇవ్వాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కూకట్‌పల్లి, బాలానగర్ మండలాల్లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను కార్పొరేటర్‌లు, తహసీల్దార్‌లతో కలిసి 290 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేసి పేదింటి కుటుంబాలకు అండగా నిలిచారన్నారు. ఎన్నికల్లో గెలవడం కోసం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేశాడు తప్ప ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమీ నెరవేర్చలేదని విమర్శించారు. కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తారనే ఆశతో ఆడపడుచులు కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే వారికి మొండిచేయి చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తులం బంగారం ఇచ్చే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, సబిహా బేగం, జూపల్లి సత్యనారాయణ, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, ముద్దం నర్సింహ యాదవ్, మహేశ్వరి శ్రీహరి పాల్గొన్నారు.

నూతన పాఠశాల ప్రారంభం

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని చరబండ రాజు కాలనీలో గ్లాండ్ ఫార్మా ఆధ్వర్యంలో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్లాండ్ ఫార్మా ఫౌండేషన్ ట్రస్టీలు కె. రఘురామన్, పి. సంపత్‌కుమార్, ఎంఈఓ హరిశ్చంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణజ్యోతి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.